# రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

## దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, డిసెంబర్ 30 : రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం దుబ్బాకలోని వంద పడకల దవాఖానలో అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి కాశీనాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా దవాఖానలో ఓపీ, ఐపీ వివరాలతోపాటు శస్త్ర చికిత్సల గురించి అడిగి తెలుసుకున్నారు. దవాఖానలో పలు సమస్యలతోపాటు వైద్య సిబ్బంది కొరత ఉందని వైద్యులు తెలిపారు. దవాఖానలో శానిటరీ సిబ్బంది, ఇన్ పేషెంట్స్‌కు ఫుడ్ వసతులపై ఆరా తీశారు. ప్రస్తుతం వంద పడకల దవాఖాన కొనసాగుతున్నప్పటికీ ఇందులో కేవలం 30 పడకలకు సంబంధించిన వైద్య సిబ్బంది మా త్రమే ఉన్నారని ఎమ్మెల్యేకు వివరించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కావాల్సిన వైద్య సిబ్బంది ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

**దుబ్బాక పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి..**

దుబ్బాక పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. దుబ్బాక మున్సిపల్ కార్యాలయంలో పట్టణాభివృద్ధిపై మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి, కౌన్సిలర్లతో ఎమ్మెల్యే ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దుబ్బాక మున్సిపల్ అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తాన్నారు. దుబ్బాకలో ప్రధానంగా ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ఔటర్ రింగ్‌రోడ్డు ఏర్పాటు చాలా అవసరమన్నారు. త్వరలోనే ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. పట్టణ ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. దుబ్బాకలోని రజనీకాంత్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో జనవరి 2న నియోజకవర్గ కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డి, దవాఖాన సూపరింటెండెంట్ హేమరాజ్, కౌన్సిలర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి రఘురామ్

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 30 : జాతీయ లోక్ అదాలత్‌కు కక్షిదారుల నుంచి విశేష స్పందన వచ్చిందని సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి రఘురామ్ అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం సిద్దిపేట కోర్టు ప్రాంగణంలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు 8,578 కేసులను పరిష్కరించారు. అనంతరం న్యాయమూర్తి రఘురామ్ మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన తప్పులు, పెండింగ్ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకునేందుకు చక్కని వేదిక లోక్‌అదాలత్ అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జడ్జిలు మురళీమోహన్, స్వాతిరెడ్డి, మిలింద్ కాంబ్లే, చందన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

**రాజీమార్గంతోనే సత్వర పరిష్కారం..**

హుస్నాబాద్, డిసెంబర్ 30 : రాజీమార్గం ద్వారానే కక్షిదారుల కేసులు సత్వరం పరిష్కారమవుతాయని మున్సిఫ్ కోర్టు జడ్జి శివరంజని అన్నారు. హుస్నాబాద్ మున్సిఫ్ కోర్టు ఆవరణలో జరిగిన జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ చిన్నచిన్న తగాదాలతో ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకొని ఏండ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని, డబ్బును వృథా చేసుకోవడం సరికాదన్నారు. ఇటువంటి కేసుల పరిష్కారం కోసమే న్యాయశాఖ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. భూతగాదాలు, ఒకరినొకరు కొట్టుకోవడం తదితర కేసులు పెట్టుకున్న కక్షిదారులు రాజీకి వచ్చి పరిష్కరించుకుంటే ఇరువర్గాలకు మేలు జరుగుతుందన్నారు. అనంతరం వివిధ రకాల కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ జడ్జి కృష్ణతేజ్, ఏపీపీ రవికిరణ్, సీఐ ఎర్రల కిరణ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

**2,080 కేసులు పరిష్కారం..**

హుస్నాబాద్‌లోని మున్సిఫ్ కోర్టులో జరిగిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 2,080 కేసులు పరిష్కారమైనట్లు జడ్జి శివరంజని తెలిపారు. ఇందులో జూనియర్ సివిల్ జడ్జి పరిధిలో 1,052 కేసులు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి పరిధిలో 1,028 కేసులను పరిష్కరించినట్లు ఆమె తెలిపారు.

**గజ్వేల్ కోర్టులో 2,380 కేసులు పరిష్కారం..**

గజ్వేల్ అర్బన్, డిసెంబర్ 30 : జాతీయ లోక్‌అదాలత్‌లో వివిధ రకాల కేసులు పరిష్కరించినట్లు గజ్వేల్ మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సౌమ్య తెలిపారు. గజ్వేల్ కోర్టు ఆవరణలో జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో జూనియర్ సివిల్ జడ్జి సౌమ్య, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి ప్రియాంక విచారించి 2,380 కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నచిన్న తగాదాలతో క్రిమినల్ కేసులు పెట్టుకుని ఇబ్బందులు పడుతున్నవారికి లోక్ అదాలత్‌లో సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ శంకర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ విజయసుధ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరికృష్ణ, న్యాయవాదులు అశోక్‌రెడ్డి, రమణ, శ్రీనివాస్, బాలముకుందరెడ్డి, జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు దేశబోయిని నర్సింహులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



సిద్దిపేట టౌన్ : లోక్ అదాలత్‌లో బాధితుడికి పరిహారం అందజేస్తున్న న్యాయమూర్తి రఘురామ్

# బాలికల వసతి గృహంలో నీటి కటకట

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్ 30 : మద్దూరు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు అనుబంధంగా ఉన్న బాలికల వసతి గృహంలో కొన్ని రోజులుగా తాగునీటి సమస్య నెలకొంది. తాగునీరు లేక విద్యార్థినులు వసతి గృహాన్ని వదలాల్సిన దుస్థితి నెలకొంది. ఈ వసతి గృహంలో ప్రస్తుతం 49 మంది విద్యార్థినులు ఉన్నారు. వసతి గృహంలో ఎలాంటి బోరు సౌకర్యం లేకపోవడంతో మిషన్ భగీరథ నీరుపైనే ఆధారపడుతున్నారు. ఒకానొక సందర్భంలో నీళ్లు లేక మరుగుదొడ్లను వాడుకోలేని పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు 15 రోజుల క్రితం నీళ్ల లేక విద్యార్థులకు వంటలు వండడం కూడా నిలిపివేసినట్లు సమాచారం. శుక్రవారం వసతి గృహంలో నీళ్లు లేవని కొంతమంది విద్యార్థినులు ఇంటిబాట పట్టారు. విషయం తెలుసుకున్న ఉన్నతాధికారులు.. కింది స్థాయి ఉద్యోగులను మందలించి సదరు విద్యార్థినులను వసతి గృహానికి తిరిగి రప్పించారు. హాస్టల్ వార్డెన్ జ్యోతి మాట్లాడుతూ వసతి గృహంలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, అయినప్పటికీ బయట నుంచి వాటర్ ట్యాంకులు తెప్పిస్తున్నట్లు తెలిపారు. శనివారం వసతి గృహాన్ని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సోగాల మనోజ్‌కుమార్ సందర్శించి మాట్లాడారు. వసతి గృహంలో నెలకొన్న నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థినులతో కలిసి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

# గౌరవెల్లి భూనిర్వాసితుల ధర్నా



నందారం క్రాస్ వద్ద ఆందోళన చేస్తున్న గిరిజనులు

అక్కన్నపేట, డిసెంబర్ 30 : మండలంలోని నందారం క్రాస్ రోడ్డు వద్ద గౌరవెల్లి భూనిర్వాసితులు, బంగారులొద్ది తండా గిరిజనులు శనివారం రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. గౌరవెల్లి ప్రాజెక్ట్‌తో ముంపునకు గురైన ప్రధాన గ్రామం గూడటిపల్లి సర్పంచ్ బద్దం రాజిరెడ్డి దిష్టిబొమ్మతో భూనిర్వాసితులు, గిరిజనులు శవయాత్ర నిర్వహించి దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌరవెల్లి ప్రాజెక్ట్‌లో ముంపునకు గురైన బంగారులొద్ది తండాను కలిపి సేవాలాల్ మహారాజ్ తండా గ్రామపంచాయతీగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉత్తర్వులు చేసిందన్నారు. అయితే, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే గ్రామ సర్పంచ్ రాజిరెడ్డి స్థానికంగా 95 శాతం గిరిజనులు ఉన్న సేవాలాల్ మహారాజ్ తండా పేరును తొలగించి, తిరిగి గూడాటిపల్లి గ్రామ పంచాయతీ పేరిట ప్రతిపాదనలు పంపించారని ఆరోపించారు. గిరిజనుల ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహారాజ్ పేరును తొలగించడం వెనుక సర్పంచ్ హస్తం ఉందని విమర్శించారు. గతంలోనూ రాజిరెడ్డి రాజకీయ లబ్ధికోసం గౌరవెల్లి ప్రాజెక్ట్‌పై కేసులు వేయించారని గుర్తుచేశారు. ఇప్పటికైనా సేవాలాల్ మహారాజ్ తండా గ్రామ పంచాయతీని కొనసాగించాలన్నారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

# తూకంలో మోసం

## పత్తి జిన్నింగ్ మిల్లు ఎదుట రైతుల ఆందోళన

రాయపోల్, డిసెంబర్ 30 : పత్తి మిల్లు యజమానులు తూకంలో మోసం చేయడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మిల్లుకు తాళం వేసి ఆందోళన నిర్వహించారు. దౌల్తాబాద్ మండలం అహ్మద్‌నగర్ సమీపంలోని పత్తి జిన్నింగ్ మిల్లుకు ప్రతిరోజు వందలాది వాహనాల్లో రైతులు పత్తి తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. శనివారం పత్తిని విక్రయిస్తున్న క్రమంలో తూకం తక్కువగా వేస్తున్నారని రైతులకు అనుమానం వచ్చింది. వెంటనే బాట్లు వేసి ఎల్రక్ట్రానిక్ కాంటను టెస్ట్ చేయగా అసలు విషయం బయటపడింది. దీంతో మిల్లు వ్యాపారుల తీరును నిరసిస్తూ రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. పత్తి మిల్లు యజమాన్యంపై కఠిన చర్యలు తీసుకొని రైతులకు నష్టం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న దౌల్తాబాద్ ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తమ పోలీస్ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకొని రైతులతో చర్చలు జరిపారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి విచారణ చేపడతామని ఎస్సై తెలపడంతో రైతులు ఆందోళన విరమించారు.



రైతులతో చర్చిస్తున్న ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న కుమార్‌యాదవ్

## సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరం

కొండపాక(కుకునూరుపల్లి), డిసెంబర్ 30 : సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరమని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్ అన్నారు. కొండపాక మండలం పెరుమాండ్లసగర్ గ్రామానికి చెందిన మహమ్మద్ శంషుదాకు మంజూరైన రూ.22,500 సీఎంఆర్‌ఎఫ్ చెక్కును శనివారం ఆయన బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చిక్కుడు భాను, మహమ్మద్ ముగ్దుమ్, పల్లె బాబు, రాకేశ్‌గౌడ్, మెరుగు శివ, వినయ్‌చారి, అఖిల్‌గౌడ్ పాల్గొన్నారు.

## కరువు భృతిని విడుదల చేయాలి

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 30 : పెండింగ్‌లో ఉన్న కరువు భృతిని ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి కోరారు. శనివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో సంఘం కార్యనిర్వాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగదు రహిత వైద్య సేవల విధివిధానాలను త్వరగా అమలు చేయాలన్నారు. మూడు విడుతల కరువు భృతిని ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజిరెడ్డి, బాలయ్య, సత్యం పాల్గొన్నారు.

## రైతులు దళారులను నమ్మొద్దు

గజ్వేల్, డిసెంబర్ 30 : రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు సూచించారు. శనివారం గజ్వేల్ పరిధిలోని వాసవి, ఈశ్వరసాయి జిన్నింగ్ మిల్లులను ఆయన తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే పత్తి అమ్ముకోవాలన్నారు. ఆయన వెంట మార్కెట్ కార్యదర్శి జాన్‌వెస్లీ, సిబ్బంది ఉన్నారు.

## దుర్గమ్మ గుడికి రూ.15,116 విరాళం

అక్కన్నపేట, డిసెంబర్ 30 : మండల కేంద్రంలో కొత్తగా నిర్మిస్తున్న దుర్గమ్మ గుడికి మండల కేంద్రానికి చెందిన ఎలసాని వెంకటయ్య శనివారం రూ.15,116 నగదును సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డికి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాత వెంకటయ్యను సర్పంచ్ శాలువాతో సన్మానించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గ్రామస్తులు, దాతల సహకారంతో దుర్గమ్మ గుడి నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాశబోయిన ఎల్లయ్య, గ్రామస్తులు చింతల మల్లారెడ్డి, సంజీవరెడ్డి, తంగళ్లపల్లి పరశురాములు, జీల కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలకు అవార్డు

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 30 : నిరుపేదలకు సేవ చేయాలనే సంకల్పం దృఢమైనదని సిద్దిపేట వాసవి క్లబ్ జోన్ చైర్మన్ శివకుమార్ అన్నారు. శనివారం విజయవాడలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ విజయభేరి అవార్డుల సభ జరిగింది. ఈ సందర్భంగా ఉత్తమ సేవల క్లబ్‌లకు అవార్డులు అందజేశారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు పాలకుర్తి గాయత్రి చేతుల మీదుగా సిద్దిపేట వాసవి క్లబ్ జోన్ చైర్మన్ పుల్లూరి శివకుమార్ అవార్డు అందుకున్నారు.

## పీఆర్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నిక

చేర్యాల, డిసెంబర్ 30 : పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా కె.వెంకటనరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఏ.శ్రీనివాస్‌రావును శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు వెంకటనరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతోపాటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. గతంలో పని చేసిన అధ్యక్షుడు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిని ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అభినందనలు తెలిపారు.

## విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), డిసెంబర్ 30 : అక్బర్‌పేట-భూంపల్లి మండలం జంగపల్లి గ్రామంలో శనివారం విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందాడు. భూంపల్లి ఎస్సై భువనేశ్వర్‌రావు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మిండే రమేశ్(37) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబ సభ్యులతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. శనివారం పొలం వద్దకు వెళ్లి వస్తానని ఇనుప సలాకను ఇంటి నుంచి తీసుకెళ్లాడు. పొలంలో ఒడ్డుపై నుంచి రమేశ్ వెళ్తున్న క్రమంలో చేతిలో ఉన్న ఇనుప సలాక బోరు బావికి సరఫరా చేసే త్రీ ఫేజ్ వైర్లకు తగలడంతో విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.